క్లుప్తంగా

సర్కిల్ ఇన్‌స్పెక్టర్ల బదిలీ


కె.విజయబాబు, రూరల్ సీఐ, కొవ్వూరు


పి.విశ్వం, పట్టణ సీఐ, కొవ్వూరు

కొవ్వూరు: కొవ్వూరు రూరల్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్‌గా కె.విజయబాబు నియమితులయ్యారు. గతంలో ఆయన కొవ్వూరు పట్టణ పోలీసు స్టేషన్ సీఐగా పని చేశారు. ఇప్పటి వరకూ ఇక్కడ పని చేసిన పి.శ్రీనివాసరావును వేకెన్సీ రిజర్వుడు (వీఆర్)కు పంపారు. ఈ నెల 4న అమావాస్య కావడంతో మరో మూడు, నాలుగు రోజుల తర్వాత కొవ్వూరు రూరల్ సీఐగా విజయబాబు బాధ్యత స్వీకరించే అవకాశం ఉంది. అలాగే కొవ్వూరు పట్టణ సీఐగా పనిచేస్తున్న వి.జగదీశ్వరరావు ఆకివీడు సర్కిల్‌కు బదిలీ అయ్యారు. ఏలూరు దిశ పోలీసు స్టేషన్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్‌గా పని చేస్తున్న పి.విశ్వం కొవ్వూరు పట్టణ పోలీసు స్టేషన్‌కు సీఐగా బదిలీపై రానున్నారు.

8న ఎస్‌ఎంసీల ఎన్నిక

తాళ్లపూడి: మండలంలోని ప్రభుత్వ పాఠశాలల్లో పాఠశాల యాజమాన్య కమిటీ (ఎస్‌ఎంసీ)ల ఎన్నికలకు నోటిఫికేషన్ విడుదల చేశామని ఎంఈవో సీహెచ్ బాలామణి శుక్రవారం తెలిపారు. మండలంలోని 32 ప్రాథమిక, ఉన్నత పాఠశాలల్లో ఎస్‌ఎంసీలను విద్యార్థుల తల్లిదండ్రుల ద్వారా ఎన్నుకుంటారన్నారు. నోటీసు బోర్డులో ఓటర్ల జాబితాను ఇప్పటికే ప్రదర్శించామన్నారు. ఓటర్ల జాబితాపై ఈ నెల 5న అభ్యంతరాలు స్వీకరించి, అదేరోజు మధ్యాహ్నం 3 గంటలకు ఓటర్ల తుది జాబితాను ప్రదర్శిస్తామన్నారు. ఆగస్టు 8వ తేదీ ఉదయం 7 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకూ ఎస్‌ఎంసీ సభ్యులను ఎన్నుకోవాలన్నారు. అదేరోజు మధ్యాహ్నం 1:30 కు చైర్మన్, వైస్ చైర్మన్ల ఎంపిక జరుగుతుందని తెలిపారు. మధ్యాహ్నం 2 గంటలకు ప్రమాణ స్వీకారం, అనంతరం కమిటీ తొలి సమావేశం నిర్వహించాలని ఎంఈఓ వివరించారు.

వైభవంగా లక్ష బిల్వార్చన


సోమేశ్వర స్వామివారికి లక్ష బిల్వార్చన

నిడదవోలు: మాస శివరాత్రి సందర్భంగా శుక్రవారం పట్టణంలోని బాలా త్రిపుర సుందరి సమేత సోమేశ్వరస్వామి వారి ఆలయంలో లక్ష బిల్వార్చన, అభిషేకాలు, అమ్మవారికి కుంకుమ పూజలు వైభవంగా నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు స్వామివారిని దర్శించుకుని, తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. ఆలయ ఈవో సోమాల శివ, ప్రధానార్చకులు శ్రీకాకుళపు లక్ష్మీ నరసింహశాస్త్రి, అభిరామ్ తదితరులు పాల్గొన్నారు.

శాకంబరీ దేవిగా దుర్గామాత


కె.సావరంలో వివిధ రకాల కూరగాయలతో దుర్గా మాత అలంకరణ

ఉండ్రాజవరం: ఆషాఢ మాసం సందర్భంగా కె.సావరం గ్రామంలోని దుర్గా మల్లేశ్వరస్వామి వారి ఆలయంలోని దుర్గామాత శుక్రవారం శాకంబరీ దేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. ఆలయ అర్చకుడు వెలవలపల్లి హరి శంకర్ ఆధ్వర్యంలో అమ్మవారిని వివిధ రకాల కూరగాయలతో అలంకరించారు. తెల్లవారుజాము నుంచి ఆలయంలో మహిళలు కుంకుమ పూజలు నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించుకుని, తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

దేవరపల్లి: ట్రాన్స్‌కో టవర్ లైన్ పనులు జరుగుతున్నందున శనివారం ఉదయం 8 నుంచి సాయంత్రం 6 గంటల వరకూ పల్లంట్ల సబ్‌స్టేషన్ పరిధిలోని లక్ష్మీపురం ఫీడర్‌కు విద్యుత్ సరఫరా నిలుపుదల చేస్తున్నట్టు ఏపీఈపీడీసీఎల్ డీఈఈ బి.వీరభద్రరరావు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. దీనివల్ల తెల్లవారుజాము 3 నుంచి 8 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉంటుందని తెలిపారు. రైతులు, గృహవినియోగదారులు గమనించాలని ఆయన తెలిపారు.

రాఘవ జీవితం స్ఫూర్తిదాయకం

రాజమహేంద్రవరం రూరల్: బళ్లారి రాఘవ జీవితం అందరికీ స్ఫూర్తిదాయకమని వ్యవసాయ కళాశాల అసోసియేట్ డీన్ డాక్టర్ డి.శ్రీనివాస్ అన్నారు. కాతేరులోని వ్యవసాయ కళాశాలలో శుక్రవారం బళ్లారి రాఘవ (తాడిపత్రి రాఘవాచార్యులు)144వ జయంతిని నిర్వహించారు.

ఉత్త కేంద్రాలు

- అలంకారప్రాయంగా సంపద తయారీ కేంద్రాలు
- లక్షలాది రూపాయలు వృథా
- మండలంలో ఎక్కడా తయారు కాని వర్మీ కంపోస్టు



తొట్టెల్లో వ్యర్థాలకు బదులు పేడ వేస్తున్న సిబ్బంది

చాగల్లు: చెత్త నుంచి సంపద తయారీ అనేది ఓ బృహత్తర పథకం. పర్యావరణానికి, పల్లెలకు ఎంతో మేలు చేస్తుంది. దురదృష్టవశాత్తూ పాలకులు, అధికారుల్లో చిత్తశుద్ధి లోపించడంతో ఆచరణకు నోచుకోకుండా ఓ నినాదంగా మాత్రమే మిగిలింది. ప్రధానంగా పల్లెల్లో పరిశుభ్రత, పంచాయతీలకు ఆదాయం కోసం ఉద్దేశించిన ఈ పథకం నీరుగారిపోయింది. చాగల్లు మండలంలోని 13 పంచాయతీల్లో లక్షలాది రూపాయల వ్యయంతో నిర్మించిన చెత్త నుంచి సంపద తయారు చేసే కేంద్రాలు అలంకారప్రాయంగా మారాయి. పంచాయతీల్లో పారిశుధ్యాన్ని మెరుగుపరచాలనే లక్ష్యంతో చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాలను ప్రభుత్వం నిర్మించింది. రూ.లక్షలు వెచ్చించి షెడ్లు ఏర్పాటు చేశారు. గ్రీన్ అంబాసిడర్ల (వీధుల్లోని వ్యర్థాలను తరలించే వారు)ను నియమించి, వారి ద్వారా ప్రతి ఇంటి నుంచి తడి, పొడి చెత్తను సేకరించి సంపద కేంద్రాలకు తరలించేలా చర్యలు చేపట్టింది. తడి చెత్తను వర్మీ కంపోస్టుగా మార్చి రైతులకు ఎరువుగా విక్రయించడం ద్వారా పంచాయతీలకు ఆదాయాన్ని సమకూర్చాలని సంకల్పించింది. అయితే పంచాయతీ పాలకుల, అధికారుల నిర్లక్ష్యంతో ప్రభుత్వ లక్ష్యం నీరుగారింది.

వేతనాలు లేక చెత్త సేకరణ చేయని సిబ్బంది

గ్రీన్ అంబాసిడర్లకు వేతనాలు చెల్లించకపోవడంతో వారు చెత్తను సేకరించడం మానేశారు. దీంతో గ్రామాల్లో ఎక్కడ వేసిన చెత్త అక్కడే ఉండిపోతోంది. మండలంలోని సంపద తయారీ కేంద్రాల్లో ఎక్కడా వర్మీ కంపోస్ట్ తయారు కావడం లేదు. చెత్త రిక్షాలు సైతం మూలన పడి తుప్పు పడుతున్నాయి. డంపింగ్ యార్డులు పిచ్చి మొక్కలు ముళ్లపొదలతో నిండి అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా మారాయి. ఇందుకోసం ప్రభుత్వం ఇప్పటికే ఖర్చు చేసిన రూ.లక్షలు నిరుపయోగంగా ప్రతి పంచాయతీలో దర్శనమిస్తున్నాయి. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి సంపద తయారీ కేంద్రాలను వినియోగంలోకి తీసుకు రావాలని మండల ప్రజలు కోరుతున్నారు.

చాగల్లులో తూతూ మంత్రంగా..

చాగల్లు పంచాయతీ పరిధిలోని సంపద తయారీ కేంద్రాల నిర్వహణ తూతూమంత్రంగా సాగుతోంది. వర్మీ కంపోస్టు కోసం ఏర్పాటు చేసిన తొట్టెలు ఖాళీగా దర్శనం ఇస్తున్నాయి. ఊనగట్ల, నెలటూరు, మార్కొండపాడు, దారవరం, ఎస్.ముప్పవరం తదితర గ్రామాల్లోనూ సంపద తయారీ కేంద్రాలు ఖాళీగానే ఉన్నాయి. చెత్తను సేకరించకుండా వ్యర్థాలకు బదులుగా తొట్టెల్లో పేడ వేసి వర్మీ కంపోస్టుకు ఉపయోగిస్తున్నారు. దీంతో చాగల్లు మండలంలో చాలాచోట్ల ఎక్కడ చెత్త అక్కడే ఉండిపోతోంది. దీంతో గ్రామీణులు తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నారు.


చాగల్లులో ఖాళీగా దర్శనం ఇస్తున్న చెత్త సంపద కేంద్రం

నిర్వహణ చేపట్టాలి



లక్షలాది రూపాయిల వ్యయంతో నిర్మించిన చెత్త నుంచి సంపద తయారు చేసే కేంద్రాలను సక్రమంగా నిర్వహించడం లేదు. వర్మీ కంపోస్టు అమ్మకాల ద్వారా ఆదాయం సమకూర్చుకునే అవకాశం ఉన్నా అధికారుల నిర్లక్ష్యం కారణంగా తూతూమంత్రంగా సంపద కేంద్రాలు మిగిలాయి. ఇప్పటికైనా అధికారులు చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాల ద్వారా ఆదాయం సమకూర్చాలి.

– సీహెచ్ నరసింహమూర్తి, ఊనగట్ల

తాగునీటి కలుషితంపై చర్యలు తీసుకోండి


మునిసిపల్ మేనేజర్ రాధాకృష్ణకు వినతిపత్రం అందజేస్తున్న పట్టణ పౌర సంఘ నాయకులు

కొవ్వూరు: నెల రోజులుగా పట్టణంలో కలుషిత తాగునీటిని సరఫరా చేయడంతో ప్రజలు తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నారని పట్టణ పౌర సంఘం కన్వీనర్ పడాల గంగాధరరావు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ మేరకు శుక్రవారం ఆయన మునిసిపల్ మేనేజర్ రాధాకృష్ణకు వినతిపత్రం అందజేశారు. తాగునీటిలో డ్రైనేజీ వాటర్ కలవడంతో తరచూ తాగునీరు నల్లగాను, మట్టితో వస్తోందన్నారు. రోజూ క్లోరినేషన్ చేయడం వల్ల నీరు బ్రౌన్ కలర్‌లో ఉంటుందన్నారు. ఇందిరమ్మ కాలనీ, 22వ వార్డుల్లో సరఫరా చేస్తున్న కుళాయి నీరు తాగడానికి వీల్లేకుండా ఉందన్నారు. పట్టణంలో గోతులమయంగా తయారైన రోడ్లకు మరమ్మతులు చేయించాలని, వీధి కుక్కల నిర్మూలనకు చర్యలు తీసుకోవాలని గంగాధరరావు కోరారు. దగ్గు రాధాకృష్ణ, తవిటియ్య, ఎన్‌బీఆర్‌బీ హరి తదితరులు పాల్గొన్నారు.

వర్గీకరణ తీర్పు ఎమ్మార్పీఎస్ పోరు ఫలితం


చాగల్లులో హర్షం వ్యక్తం చేస్తున్న ఎమ్మార్పీఎస్ నాయకులు

చాగల్లు: రాష్ట్ర ప్రభుత్వాలు ఎస్సీ, ఎస్టీ రిజర్వేషన్ల ఉప వర్గీకరణ చేయవచ్చంటూ సుప్రీం కోర్టు వెలువరించిన చారిత్రాత్మక తీర్పు ఎమ్మార్పీఎస్ సుదీర్ఘ పోరాటానికి దక్కిన ఫలితమని విశ్రాంత ఏఎస్‌డబ్ల్యూఓ తిగిరిపల్లి సాల్మన్ రాజు అన్నారు. రాజ్యాంగం కల్పించిన ఎస్సీ రిజర్వేషన్లను ఏ బి సి డిగా వర్గీకరించాలంటూ మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి అధ్యక్షుడు మంద కృష్ణ మాదిగ ఒడిదుడుకులు ఎదుర్కొంటూ పోరాటం చేశారన్నారు. చాగల్లులో శుక్రవారం మాజీ ఉప ప్రధాని బాబూ జగ్జీవన్‌రామ్ విగ్రహానికి సాల్మన్ రాజు నివాళి అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎమ్మార్పీఎస్ పోరాటాలకు సుప్రీం కోర్టు తీర్పు ద్వారా ఫలితం దక్కడం హర్షణీయమన్నారు. ఎమ్మార్పీఎస్ మరో నాయకుడు జొన్నకూటి సుబ్బారావు మాట్లాడుతూ వర్గీకరణకు సానుకూలంగా తీర్పు వచ్చిన నేపథ్యంలో ఎస్సీల్లో ఐక్యత చెక్కు చెదరకుండా చూసుకోవాల్సిన బాధ్యత ఆ సామాజికవర్గ మేధావులు, విద్యావంతులపై ఉందన్నారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ జొన్నకూటి వెంకాయమ్మ, బిల్లిపో ఆనందరావు, బన్ను, గెడ్డం సురేష్, సిరా రాకేష్ తదితరులు పాల్గొన్నారు. సుప్రీం కోర్టు తీర్పుపై బ్రాహ్మణగూడెం, ఎస్.ముప్పవరం గ్రామాల్లోనూ ఎమ్మార్పీఎస్ నాయకులు హర్షం వ్యక్తం చేశారు.

తీర్పు చరిత్రాత్మకం

ఉండ్రాజవరం: ఎస్సీ వర్గీకరణకు అనుకూలంగా సుప్రీం కోర్టు ఇచ్చిన తీర్పు చరిత్రాత్మకమని ఎమ్మార్పీఎస్ మండల శాఖ అధ్యక్షుడు, న్యాయవాది సునీల్‌రాజ్ బొల్లిపో, రాష్ట్ర నాయకుడు దిద్దే మధుబాబు, అధికార ప్రతినిధి గాలింకి సంతోష్ శుక్రవారం హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా మోర్త గ్రామంలోని మాజీ ఉప ప్రధాని, దళిత బాంధవుడు బాబూ జగ్జీవన్‌రామ్ విగ్రహానికి వారు పూలమాలలు వేసి నివాళి అర్పించారు. అనంతరం వారు మాట్లాడుతూ దాదాపు 30 ఏళ్లుగా చేస్తున్న పోరాటం ఫలించిందన్నారు. కార్యక్రమంలో గాలింకి వెంకట్, గాలింకి ప్రతాప్, మోర్త నాయకులు మధు, శేఖర్, సుబ్బారావు, సూర్యచంద్రం, రామారావు, సత్యనారాయణ, బ్రహ్మానందం, ఏసేబు, కిషోర్ పాల్గొన్నారు.

బాధిత కుటుంబాలకు దాతల ఆర్థిక సాయం


దేవరపల్లి మండలం యర్నగూడెంలో జరిగిన అగ్నిప్రమాద బాధిత కుటుంబాలు

దేవరపల్లి: మండలంలోని యర్నగూడెం గ్రామంలో శుక్రవారం సంభవించిన అగ్ని ప్రమాదంలో సర్వం కోల్పోయి నిరాశ్రయులైన అడపాక రాము, వృద్ధురాలు మహాలక్ష్మి కుటుంబాలకు దాతలు ఆర్థిక సాయం చేసి అండగా నిలిచారు. పంచాయతీ ఉప సర్పంచ్ నరహరిశెట్టి దొరబాబు రూ.10 వేలు, మానవత స్వచ్ఛంద సంస్థ మండల శాఖ రూ.5 వేలు, ముంగర దుర్గారావు రూ.3 వేలు, నల్లం మూర్తి రూ.5 వేలు, గద్దే ప్రసాద్ వంట పాత్రలకు రూ.1,500, నరహరిశెట్టి హరి రూ.2 వేలు సాయంగా అందజేశారు. అలాగే యర్నగూడెం సర్పంచ్ బొంతా భరత్‌బాబు రూ.10 వేల సాయంగా అందజేశారు. యువ పారిశ్రామికవేత్త పెన్మత్స సుబ్బరాజు బాధిత కుటుంబాలను పరామర్శించి రూ.5 వేల సహాయం చేశారు. కృష్ణంపాలెంలోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ వృద్ధాశ్రమం నిర్వాహకురాలు జి.శ్యామలాదేవి 25 కిలోల బియ్యం, దుప్పట్లు అందించారు. ప్రభుత్వ జూనియర్ కళాశాల అభివృద్ధి కమిటీ చైర్మన్ గద్దే శ్రీనివాసరావు రూ.3 వేలు సహాయంగా అందజేశారు.

రిక్షా కార్మికుల ఆందోళన



ఆందోళన చేస్తున్న ఫ్లాట్‌ఫాం రిక్షా కార్మికులు

నిడదవోలు: పట్టణంలోని యర్నగూడెం రోడ్డు పశువుల ఆసుపత్రి కూడలిలో ప్లాట్‌ఫాం రిక్షా స్టాండ్ కేటాయించాలని కోరుతూ ఆదర్శ ప్లాట్‌ఫాం రిక్షా వర్కర్స్ యూనియన్ (ఐఎఫ్‌టీయూ) ఆధ్వర్యంలో శుక్రవారం ఆందోళన చేశారు. ఈ సందర్భంగా యూనియన్ అధ్యక్షుడు కోనేటి మల్లేశ్వరరావు మాట్లాడుతూ దశాబ్దాలుగా తాము ప్లాట్‌ఫాం రిక్షాల ద్వారా గృహ నిర్మాణ సామగ్రి రవాణా చేస్తూ జీవనం సాగిస్తున్నామన్నారు. ప్రస్తుతం కురుస్తున్న వర్షాలకు రోడ్ల పక్కన నిలబడుతూ ఇబ్బందులు పడాల్సి వస్తోందన్నారు. ఐఎఫ్‌టీయూ జిల్లా సహాయ కార్యదర్శి ఈమని గ్రీష్మకుమార్ మాట్లాడుతూ దశాబ్దాలుగా రోడ్ల పక్కనే ఎండకు ఎండుతూ, వానకు తడుస్తూ బతుకుతున్న రిక్షా కార్మికుల ఉపాధిని కాపాడాలన్నారు. ఆందోళనలో యూనియన్ నాయకులు లంకాడ గణపతి, బంకపల్లి నాగేశ్వరరావు, నంగాలు, సిర్రా రాఘవులు, చొక్కాకుల సత్తిబాబు, అడబాల రమణ తదితరులు పాల్గొన్నారు.

వర్షాలు కురవకున్నా ముంచెత్తుతున్న వరద


నల్లజర్ల పోలీస్ స్టేషన్ వెనుక పల్లపు ప్రాంతాలను ముంచెత్తిన వరద నీరు

నల్లజర్ల: వర్షాలు కురవకపోయినా ఎగువ నుంచి వస్తున్న నీరు కొన్ని ప్రాంతాలను ముంచెత్తుతోంది. మండలంలో రిజర్వు ఫారెస్ట్ నుంచి వస్తున్న వర్షపు నీరు తొలుత దిగువ గ్రామాల చెరువులను ముంచెత్తుతోంది. తర్వాత చెరువు కట్టలు తెగి రాత్రికి రాత్రే దిగువన పల్లపు ప్రాంత జనావాసాల్లోకి చేరుతోంది. శుక్రవారం తెల్లవారుజామున ద్వారకాతిరుమల మండలంలోని చెరువులు తెగి పుల్లలపాడు వీరమ్మగుంట చెరువు, నల్లజర్ల గ్రామంలోని నల్ల–ఎర్ర చెరువులు నిండిపోయాయి. తర్వాత ఆ నీరు దిగువన ఉన్న పల్లపు ప్రాంతాలను ముంచెత్తింది. దీనికి వాగులో అక్కడక్కడా గుర్రపు డెక్క అడ్డుపడడంతో నీరు ఎగదన్నింది. నల్లజర్ల సర్పంచ్ పల్లి జ్యోతి సూచనలతో సిబ్బంది ఉదయాన్నే పొక్లెయిన్ సాయంతో రెండు చోట్ల అడ్డంకులు తొలగించి వరద నీరు ఉప్పర్ల కాలనీలోకి రాకుండా నిరోధించారు. గతేడాది కూడా ఇదే పరిస్థితి ఏర్పడి కాలనీ వాసులు వారం రోజుల పాటు పునరావాస కేంద్రంలో తలదాచుకోవాల్సి వచ్చింది. ఏమాత్రం అలక్ష్యం చేసినా అదే పరిస్థితి పునరావృతం అయ్యేదని ఆ గ్రామ పెద్ద పల్లి సుబ్బారావు వివరించారు. మరో రెండు పెద్ద తూరలు అమర్చి సుంకేసుల ఆసుపత్రి మార్గం వెడల్పు చేయాల్సి ఉందన్నారు.

పింగళి వెంకయ్యకు నివాళి


ప్రక్కిలంక పాఠశాలలో వెంకయ్య జయంతి నిర్వహిస్తున్న మానవత సంస్థ సభ్యులు, ఉపాధ్యాయులు


కొవ్వూరు సంస్కృత కళాశాలలో పింగళి వెంకయ్య చిత్ర పటానికి నివాళులు

తాళ్లపూడి: భారత జాతీయ జెండా రూపశిల్పి పింగళి వెంకయ్య జయంతిని శుక్రవారం మానవత స్వచ్ఛంద సంస్థ మండల శాఖ ఆధ్వర్యంలో ప్రక్కిలంక మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల్లో నిర్వహించారు. వెంకయ్య చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. పాఠశాల విద్యార్థులకు పింగళి వెంకయ్య జీవిత విశేషాలను వివరించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు కందుల శ్రీనివాస్, మానవత సంస్థ మండల శాఖ అధ్యక్షుడు అంకెం సురేష్, జిల్లా బ్లడ్‌బ్యాంక్ డైరెక్టర్ జె.వెంకటేశ్వరరావు, ఆ సంస్థ సభ్యులు, విద్యార్థులు పాల్గొన్నారు.

కొవ్వూరులో..

కొవ్వూరు: దేశానికి ఒక జెండా ఉండాలన్న సంకల్పంతో జాతీయ జెండాకు రూపకల్పన చేసిన మహనీయుడు పింగళి వెంకయ్య చిరస్మరణీయుడని వక్తలు పేర్కొన్నారు. పట్టణంలోని ఎస్‌వీజేవీ సంస్కృత కళాశాలలో శుక్రవారం భారత వికాస పరిషత్ కొవ్వూరు శాఖ అధ్యక్షుడు వై.రమేష్ ఆధ్వర్యంలో పింగళి వెంకయ్య జయంతి వేడుకలు నిర్వహించారు. ప్రిన్సిపాల్ గౌరీశంకర్, ఈమని దక్షిణామూర్తి, ఎం.వాచికుమారి, ఏవీ లోకేష్, గీతాలక్ష్మి తదితరులు వెంకయ్య చిత్ర పటానికి పూలు వేసి నివాళి అర్పించారు.

అధిక ఎరువు అనర్థదాయకమే

నల్లజర్ల: ఈ ఖరీఫ్ సీజన్‌లో మండలంలోని 7,400 ఎకరాల్లో రైతులు వరి సాగు చేస్తున్నారు. నాట్లు దాదాపు పూర్తి కావొచ్చాయి. సాగులో కొద్దిపాటి మెళకువలు పాటిస్తే అధిక దిగుబడులు సాధించవచ్చని ఏవో కె.కమల్‌రాజ్ సూచించారు. వరి పంటకు మోతాదుకు మించి ఎరువులు వినియోగిస్తున్నారని అందులోనూ యూరియా నాలుగైదు సార్లు వేస్తున్నారని ఆయనన్నారు. ఎరువుల అధిక వినియోగం అనర్థదాయకం అని హెచ్చరించారు. గ్రామాల్లో విలేజ్ అగ్రికల్చర్ అసిస్టెంట్లు చేస్తున్న సూచనలను రైతులు పాటిస్తే పెట్టుబడి ఖర్చు తగ్గడమే కాకుండా అధిక పంట దిగుబడులు సాధించవచ్చన్నారు. భూసార పరిరక్షణతో పాటు నాణ్యమైన ఉత్పత్తులు సాధించాలంటే రసాయన ఎరువులతో పాటు సేంద్రియ ఎరువులను కూడా వినియోగించాలన్నారు.

నెమ్మదిస్తున్న గోదావరి వరద

కొవ్వూరు: గోదావరి నదిలో వరద ఉధృతి నెమ్మదిస్తోంది. వారం రోజులుగా ముంపులో ఉన్న కొవ్వూరు గోష్పాద క్షేత్రంలోని స్నానఘట్టాలు నెమ్మదిగా తేరుకుంటున్నాయి. ధవళేశ్వరం ఆనకట్ట వద్ద మొదటి ప్రమాద హెచ్చరికను ఉపసంహరించారు. క్షేత్రానికి వెళ్లే రహదారులు బురదగా ఉన్నాయి. రోడ్లను శుభ్రం చేయడంపై ఇంకా కొవ్వూరు మునిసిపాలిటీ దృష్టి సారించలేదు. గోదావరి లంకల్లో నీట మునిగిన పంట పొలాలు తేరుకున్నాయి. సుమారు వారానికి పైగా ముంపులోనే ఉండడంతో పంటలు దెబ్బతిన్నాయని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గోదావరి నదికి ఎగువ ప్రాంతంలోను నీటిమట్టాలు తగ్గుముఖం పట్టాయి. దీంతో దిగువన కొవ్వూరులో ఒకటి, రెండు రోజుల్లో వరద సాధారణ స్థితికి చేరుకునే అవకాశం ఉంది. శుక్రవారం మధ్యాహ్నం మూడు గంటలకు ధవళేశ్వరం ఆనకట్ట వద్ద నుంచి 8.80 లక్షల క్యూసెక్కుల వరద నీటిని సముద్రంలోకి విడిచి పెడుతున్నారు.

రిటైర్డ్ వీఆర్వో 'నండూరి' మృతికి సంతాపం

నిడదవోలు రూరల్: మండలంలోని మునిపల్లి గ్రామానికి చెందిన రిటైర్డ్ వీఆర్వో నండూరి సుబ్బరాజు (ఆనంద సరస్వతి స్వామి) మృతికి రెవెన్యూ ఉద్యోగులు, గ్రామస్తులు శుక్రవారం సంతాపం వ్యక్తం చేశారు. మునిపల్లి, డి.ముప్పవరం గ్రామాల్లో రెవెన్యూ అధికారిగా పనిచేసిన సుబ్బరాజు మునిపల్లిలో సుబ్బరాజు ఆశ్రమం ఏర్పాటు చేసి పలు ఆధ్యాత్మిక కార్యక్రమాలు విస్తృతంగా నిర్వహించారన్నారు. సుబ్బరాజు చిత్ర పటానికి ఏపీఎస్ ఆర్టీసీ రిటైర్డ్ ఉద్యోగి ఎస్.నాగరాజారావు, వీఆర్వోలు పూలమాలలు వేసి నివాళులర్పించారు.

ట్రాన్స్‌కో ఏఈ బీవీఆర్ మూర్తికి పదోన్నతి

నిడదవోలు రూరల్: మండలంలోని పురుషోత్తపల్లి ట్రాన్స్‌కో ఏఈ బీవీఆర్ మూర్తికి డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ (ఏడీఈ)గా పదోన్నతి లభించింది. బీవీఆర్ మూర్తిని ఏలూరు ట్రాన్స్‌కో కార్యాలయంలో క్వాలిటీ ఏడీఈగా నియమిస్తూ ఉన్నతాధికారులు ఆదేశాలు జారీ చేశారు. ఈ సందర్భంగా పదోన్నతి పొందిన బీవీఆర్ మూర్తిని ట్రాన్స్‌కో ఉద్యోగులు, సిబ్బంది శుక్రవారం అభినందించారు.

నేడు ఎంపీ పురందేశ్వరి గౌరీపట్నం రాక

దేవరపల్లి: రాజమహేంద్రవరం ఎంపీ దగ్గుబాటి పురందేశ్వరి, గోపాలపురం ఎమ్మెల్యే మద్దిపాటి వెంకట్రాజు శనివారం ఉదయం 11 గంటలకు దేవరపల్లి మండలం గౌరీపట్నం గ్రామంలో పర్యటిస్తారని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం నుంచి శుక్రవారం ఒక ప్రకటన వెలువడింది. కొవ్వాడ కాలువ ముంపుతో దెబ్బతిన్న పంట పొలాలను ఎంపీ, ఎమ్మెల్యేలు పరిశీలిస్తారు. అనంతరం పంట నష్టం గురించి అధికారులతో ప్రజాప్రతినిధులిద్దరూ చర్చిస్తారు.

6న వాసవీ మాతకు సారె సమర్పణ

కొవ్వూరు: శ్రావణ మాసం సందర్భంగా ఈనెల ఆరో తేదీన ఆర్యవైశ్య కల్యాణ మండపంలోని వాసవీ కన్యకా పరమేశ్వరి అమ్మవారికి పసుపు, కుంకుమ సారె సమర్పించనున్నట్టు ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు మద్దుల సోమరాజు శుక్రవారం తెలిపారు. వజ్ర వనిత, వాసవీ క్లబ్ మహిళా సంఘం ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్టు తెలిపారు.

బిడ్డకు పాలే సంజీవని

తల్లిపాల వారోత్సవాలు ప్రారంభం


నల్లజర్ల మండలం అచ్చన్నపాలెంలో తల్లులతో ప్రమాణం చేయిస్తున్న ఐసీడీఎస్ సూపర్‌వైజర్ కృష్ణవేణి

నల్లజర్ల: తల్లిపాలే బిడ్డకు సంజీవని అని ఐసీడీఎస్ అనంతపల్లి సెక్టార్ సూపర్‌వైజర్ ఎస్‌వీ కృష్ణవేణి సూచించారు. తల్లిపాల ఆవశ్యకతను వివరిస్తూ మాతా శిశుసంక్షేమ శాఖ, వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో అంగన్‌వాడీ కేంద్రాల్లో తల్లిపాల వారోత్సవాలకు శ్రీకారం చుట్టి తల్లులను చైతన్యం చేస్తున్నారు. ఆరు నెలల వరకూ తల్లిపాలే బిడ్డకు పట్టాలని సూచించారు. ఈ సందర్భంగా తల్లిపాల విశిష్టత, బాలింతలు, గర్భిణులు తీసుకోవాల్సిన జాగ్రత్తలను ఆమె అచ్చన్నపాలెంలో వివరించారు. ఈనెల 7వ తేదీ వరకూ ఈ కార్యక్రమాలు జరుగుతాయని సూపర్‌వైజర్ తెలిపారు. ప్రభుత్వం అందిస్తున్న పౌష్టికాహారాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఏఎన్‌ఎం జ్యోతి వివరించారు. కార్యకర్తలు వెంకటరత్నం, గజలక్ష్మి, ఆశ, అంగన్‌వాడీ ఆయాలు పాల్గొన్నారు. బిడ్డలకు తల్లిపాలే పడతామంటూ తల్లులతో ప్రమాణం చేయించారు. అలాగే దూబచర్ల సెక్టారులో గంటావారిగూడెం, నల్లజర్ల సెక్టార్‌లో చీపురుగూడెంలలో తల్లిపాల వారోత్సవ అవగాహన కార్యక్రమాలు జరిగాయి. సూపర్‌వైజర్ వెంకటలక్ష్మి, కార్యకర్తలు,ఆయాలు పాల్గొన్నారు.

సంపూర్ణ ఆరోగ్యం

నిడదవోలు రూరల్: బిడ్డ పుట్టిన వెంటనే తల్లి పాలు తాగించడం వల్ల అనేక రోగాల నుంచి బిడ్డకు రక్షణ కలుగుతుందని పీహెచ్‌సీ వైద్యాధికారి ఎం.శివాజీ అన్నారు. తల్లిపాల వారోత్సవాల సందర్భంగా మండలంలోని సమిశ్రగూడెంలో శుక్రవారం తల్లిపాల ఆవశ్యకతపై ఆరోగ్య, అంగన్‌వాడీ సిబ్బంది అవగాహన ర్యాలీ నిర్వహించారు. బిడ్డకు తల్లిపాల వల్ల కలిగే ప్రయోజనాలను వివరించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ సెక్టార్ సూపర్‌వైజర్ పి.నళిని, ఎంపీహెచ్‌ఈఓ ఎ.రాజమోహన్, ఆరోగ్య, అంగన్‌వాడీ, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.


గోపాలపురంలో ర్యాలీ నిర్వహిస్తున్న అంగన్‌వాడీ కార్యకర్తలు

గోపాలపురంలో అవగాహన ర్యాలీ..

గోపాలపురం: బిడ్డ పుట్టిన అరగంటలోగా తల్లిపాలు పడితే బిడ్డ ఆరోగ్యంగా పెరుగుతుందని ఐసీడీఎస్ ఇన్‌చార్జి సీడీపీఓ యు. పద్మావతి అన్నారు. తల్లిపాల వారోత్సవాల్లో భాగంగా శుక్రవారం గోపాలపురంలో అవగాహనా ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా సీడీపీఓ పద్మావతి మాట్లాడుతూ ప్రసూతి సమయంలో తల్లి సరైన పోషకాహారాన్ని తీసుకోవాలన్నారు. అంగన్‌వాడీ సెంటర్ల ద్వారా తల్లీబిడ్డలకు కావాల్సిన పోషకాహారం అందిస్తున్నామని, దానిని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు వి. రమణ, అంగన్‌వాడీ, ఆశ, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.